## క్లుప్తంగా

### లక్ష్యసాధనతో జీవితంలో మార్పు



ఎస్‌ఐ అనిల్‌ను సన్మానిస్తున్న సెబ్ ఏఎస్పీ జీ రామకృష్ణ

రాయదుర్గం: లక్ష్యసాధనతోనే జీవితంలో మార్పు సాధ్యమని జిల్లా సెబ్ అడిషనల్ ఎస్పీ జీ రామకృష్ణ అన్నారు. పట్టణంలోని సెబ్ పీఎస్‌లో పోలీస్ ఉద్యోగం చేస్తూ ఇటీవల విడుదలైన ఎస్‌ఐ ఫలితాల్లో చోటు దక్కించుకున్న అనిల్‌కుమార్‌ను సీఐ జయనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం ఘన సన్మానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ ఎస్పీ పూలు, శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పనిలోనూ కృషి, పట్టుదల అవసరమన్నారు. ఎస్‌ఐ ఫలితాల్లో సత్తాచాటిన అనిల్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎస్‌ఐ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

### మహిళాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న స్త్రీనిధి ఏజీఎం హనుమేష్ బాబు

కూడేరు: డ్వాక్రా సంఘాల్లో ఉన్న ప్రతి సభ్యురాలినీ లక్షాధికారి చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్త్రీనిధి ఏజీఎం హనుమేష్ బాబు అన్నారు. శుక్రవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో మండల విజేత సమాఖ్య అధ్యక్షురాలు వసంత అధ్యక్షతన 'సంఘ సభ్యురాళ్ల ఆదాయాన్ని ఎలా పెంచాలి' అనే అంశంపై యానిమేటర్లకు శిక్షణ కార్యక్రమంనిర్వహించారు. ఏజీఎం ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్త్రీనిధి, బ్యాంకు రుణాల నగదును ఆదాయాన్ని ఇచ్చే వాటికి వినియోగించుకునేలా చూడాలన్నారు. ఏపీఎం రాజశేఖర్ , సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

### సంఘం అభివృద్ధికి కృషి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలీయ సంక్షేమ సంఘం నాయకులు

రాయదుర్గంటౌన్: సమష్టిగా పద్మశాలీయ సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు అరవా శివప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని భక్త మార్కండేయ స్వామి ఆలయంలో 2024 పద్మశాలీయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథులుగా ఏపీ పద్మశాలీయ సంఘం ఉపాధ్యక్షురాలు వసుంధర, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, జాతీయ పద్మశాలీయ సంఘం కార్యదర్శి పొరాళ్ల రాజు, రాయలసీమ పద్మశాలీయ సంఘం సంయుక్త కార్యదర్శి పొరాళ్ల ధనార్జున, కార్యదర్శి రామస్వామి, కౌన్సిలర్ గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి నాగప్ప, ఆ సంఘం పెద్దలు, కమిటీ సభ్యులు, సమాజ సభ్యులు హాజరై క్యాలెండర్ ఆవిష్కరించారు.

### యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

రాయదుర్గంటౌన్: గుమ్మఘట్ట మండలశాఖ యూటీఎఫ్ వార్షిక క్యాలెండర్, పోస్టర్లు, డైరీలను శుక్రవారం పట్టణంలోని ఎమ్మార్సీలో ఎంఈఓలు నాగమణి, రామచంద్ర ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, గౌరవాధ్యక్షుడు మంచి నాగరాజు, యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామాంజనేయులు, నాగరాజు, కోశాధికారి శ్రీనివాస్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

### వైభవంగా ఆరాధన రథోత్సవం



చత్రప్రభ అలంకరణలో నారాయణార్యరూఢస్వామి

బొమ్మనహాళ్: మండలంలోని విరుపాపల్లిలో నారాయణార్యరూఢస్వామి రథోత్సవాన్ని శుక్రవారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో రుద్ర యజ్ఞం, రుద్రాభిషేకం, మహాబిల్వార్చన, పూజలు చేపట్టారు. రాత్రికి నారాయణార్యరూఢ స్వామి రథోత్సవాన్ని ఆలయ కమిటీ ట్రస్టు నిర్వాహకులు, మఠాడు మఠాధ్యక్షుడు జ్ఞానమూర్తి స్వామి, మఠాధ్యక్షుడు మారాచి సూర్యనారాయణస్వామి, గ్రామ పెద్దలు, ట్రస్టు సభ్యులు, భక్తులు ప్రారంభించారు. మంగళ వాయిద్యాలు, నంది కోలాటలు, చెక్కభజనలతో భక్తులు రథాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామి ఛత్రప్రభ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అలాగే భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

#### ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం

గుమ్మఘట్ట: మండలంలోని కె.పి.కుంటలో ఆంజనేయస్వామి రథోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంలో అధిష్టించి గ్రామంలో ఊరేగించారు. రథం ముందు మహిళలు కలశాలను ప్రదర్శించగా, యువకులు నందికోళ్లతో నృత్యం చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

# వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించండి

- ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి
- పండుగలా పింఛన్ల పంపిణీ వారోత్సవం



శెట్టూరు: మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య



విడపనకల్లు: పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

శెట్టూరు: వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించాలని కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ పింఛన్ కానుక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడారు. తాను అధికారిగా పనిచేసిన కాలంలో పేదల సమస్యలను గుర్తించానన్నారు. ప్రజాసేవ చేయాలని రాజకీయాల్లోకి వచ్చానన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో అనంతపురం పార్లమెంటు సభ్యుడిగా గెలుపొంది ప్రజాసేవలో ముందుకెళ్తున్నానన్నారు. రాజకీయాల్లో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవకు వచ్చానన్నారు. గతంలో చంద్రబాబు హయాంలో ఒక లబ్ధిదారుడు చనిపోతే మరొకరికి రూ.75 పింఛను అందించే పరిస్థితి ఉండేదన్నారు. ఇది ఒక అధికారిగా అప్పట్లో నా కళ్లారా చూశానన్నారు. మహానేత వైఎస్సార్ హయాంలో వృద్ధులకు రూ.200 పింఛను ఇచ్చారన్నారు. అయితే నేడు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దివ్యాంగులు, వితంతులు, వృద్ధులకు అర్హతే ప్రామాణికంగా ఏకంగా రూ.3 వేల పింఛను అందిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అత్యధికంగా పింఛను అందజేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీకే చెల్లుతుందన్నారు. తాము సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలు చేయమన్నారు. అంతకుముందు ఆడవిగొల్లపల్లిలో ఎంపీ రంగయ్యకు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ తదితరులు వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే శెట్టూరు మండల కేంద్రంలో అంబేద్కర్, వైఎస్సార్, వాల్మీకి విగ్రహాలకు ఎంపీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అయ్యగార్లపల్లిలో జెడ్పీటీసీ మంజునాథ్ స్వగృహంలో తేనేటి విందుకు హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ తిమ్మరాజమ్మ, ఎంపీపీ లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, కో ఆప్షన్ సభ్యుడు మన్సూర్, మాజీ ఎంపీపీ రాంభీమప్ప, ఎంఎస్ హనుమంతరాయుడు, తిప్పేస్వామి, అబ్దుల్‌రజాక్, వీరాంజనేయులు, సర్పంచులు సత్యనారాయణ రెడ్డి, ఈరన్న, పాలయ్య, వెంకటేశులు, వన్నూరుస్వామి, నాగరాజు, ఎంపీటీసీలు నరసింహులు, ప్రహ్లాద, మల్లేశ్, శ్యాంసుందర్, మిద్దె సుధాకర్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

### గొప్పమానవతావాది సీఎం జగన్

ఉరవకొండ/విడపనకల్లు: కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవాడికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న గొప్ప మానవతావాది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం ఉరవకొండ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో పింఛన్ పెంపు వారోత్సవ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో రూ.3 వేలు పింఛన్ అందజేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప ప్రజాస్వామ్యవాదిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ప్రతి నెలా పింఛన్‌ల రూపంలో రూ.2 వేల కోట్లను 85వేల మంది పింఛన్ దారులకు అందిస్తున్నారన్నారు. ఉరవకొండ మండలంలో ప్రతినెలా రూ.3.13 కోట్లు పింఛన్ల కోసమే ప్రభుత్వం ఖర్చుపెడుతుందన్నారు. పెరిగిన పింఛన్లతో అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువుల ఆత్మగౌరవం మరింత పెరిగిందన్నారు.

### పయ్యావుల పచ్చి మోసగాడు

ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పచ్చిమోసగాడని, ఎన్నికలు మరో రెండు నెలల సమయం ఉందనప్పుడు మాత్రమే ఆయన ప్రజలకు కన్పిస్తాడన్నారు. ప్రజల కోసం కాకుండా కేవలం ఎన్నికల కోసమే కేశవ్ రాజకీయాలు చేస్తాడన్నారు. అలాంటి మోసగాడు మరోసారి మీ వద్దకు వచ్చి మాయమాటలతో మోసగించేందుకు సిద్ధమయ్యాడని, అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ, కమ్యూనిస్టులు కలిసి కట్టుగా పోటీ చేసి జగన్‌ను ఓడించేందుకు కుట్ర పన్నుతున్నారని.. ఇంకా 10 పార్టీలు కలిసినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అమృతరాజ్, ఈఓఆర్‌డీ చంద్రమౌళి, ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, ఉప సర్పంచ్ వన్నప్ప, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, సమన్వయకర్త ఓబన్న, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పీఏసీఎస్ చైర్మన్ వడ్ల షేక్షావలి, పెన్నహోబిలం ఆలయ చైర్మన్ అశోక్, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, మాజీ ఎంపీపీ చంద్రమ్మ, జేసీఎస్ కన్వీనర్ ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

- విడపనకల్లు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగుల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగు నింపారన్నారు. ఎన్నికల సమయం ఆసన్నమవడంతో తెలుగుదేశం, జనసేన తదితర పార్టీలన్నీ జగన్ పాలనపై దుమ్మెత్తి పోస్తున్నారని, అలాంటి వారికి మీ ఓటుతో గట్టిగా బుద్ధి చెప్పాలని కోరారు. జగన్‌ను మరోసారి ఆశీర్వదిస్తే మన తలరాతలు, మన పిల్లల భవిష్యత్తు మారుతాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, సర్పంచులు మోదుపల్లి రామాంజనేయులు, ఉప సర్పంచు ఓబుళమ్మ, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి సుంకన్న, భీంరెడ్డి, దేశాయ్ సిద్దార్థ, ఎంపీటీసీలు మల్లికార్జు, తిమ్మారాజు, నాయకుల రాజశేఖర్, గిరిబాబు, కోఆప్షన్ మెంబర్ లతీఫ్, రోజా, ఎంపీడీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు పింఛన్ వారోత్సవాలు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయం పక్కన మినీ కల్యాణ మండపంలో శనివారం వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని వారు కోరారు.

### సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



వజ్రకరూరు మండలం పీసీ.ప్యాపిలిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు, ప్రజాప్రతినిధులు

వజ్రకరూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని పింఛన్‌దారులు అన్నారు. మండలంలోని పీసీ ప్యాపిలి గ్రామ సచివాలయంలో ఫింఛన్ల పెంపు వారోత్సవాలు నిర్వహించారు. సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుంకమ్మ, సర్పంచు జ్యోతిబాయి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కిష్టప్ప, మండల కార్యదర్శి అర్జున్, యు వజన విభాగం ఉపాధ్యక్షుడు ప్యాపిలి వీరా, ఎస్టీ సెల్ అధ్యక్షుడు చంద్రానాయక్, సచివాలయ కన్వీనర్ సత్యప్ప తదితరులు పాల్గొన్నారు.

### ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



అంజినమ్మకు నగదు అందజేస్తున్న వలంటీర్ క్రిష్ణమూర్తి

కూడేరు: మండలంలోని కడదరకుంటకు చెందిన అంజినమ్మ ఇటీవల కాలు విరగడంతో అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ క్రిష్ణమూర్తి శుక్రవారం సొంత ఖర్చులతో ఆస్పత్రికి వెళ్లి అంజనమ్మకు పెంచిన పింఛన్ రూ.3 వేల నగదును అందజేశారు. దీంతో అంజనమ్మ మురిసిపోయింది. సీఎం జగన్ చల్లంగా ఉండాలని, మళ్లీ అధికారంలోకి రావాలని ఆమె దేవున్ని ప్రార్థించింది.

# శిరివాళేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి



పూజలు చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

బ్రహ్మసముద్రం: మండలంలోని వేపులపర్తిలో ఉన్న శిరివాళేశ్వరస్వామిని శుక్రవారం మంత్రి ఉషశ్రీచరణ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి మంత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ తమ ఇలవేల్పు శిరివాళేశ్వర స్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బసవరాజు, ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ రాష్ట్ర డైరెక్టర్ కమలాక్షి, శెట్టూరు మండల కన్వీనర్ శివనప్ప యాదవ్, తిమ్మరాజు, పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచులు రంగప్ప, పూజ, ఎంపీటీసీ బూసప్ప, నాయకులు నజీర్, ఎర్రిస్వామి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతు కుటుంబానికి ప్రభుత్వ అండ



కొనకొండ్లలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న రైతు కుటుంబ సభ్యులు

వజ్రకరూరు: ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తూ ఆదుకుంటున్నట్లు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. మండలంలోని కొనకొండ్లకు చెందిన రైతు కట్లగేరి నాగప్ప అప్పులబాధ తాళలేక 2023 ఏప్రిల్ 23న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్సీ తీసుకువెళ్లారు. ప్రభుత్వం స్పందించి రైతు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.ఏడు లక్షలు మంజూరు చేసింది. శుక్రవారం కొన కొండ్లలోని ఎమ్మెల్సీ స్వగృహంలో బాధిత రైతు కుటుంబసభ్యులకు ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కును ఎమ్మెల్సీ అందచేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకుంటున్న రైతు కుటుంబాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుంటున్నారన్నారు. అనంతరం రైతు కుటుంబసభ్యులు మాట్లాడుతూ కుటుంబానికి అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్సీకి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచు నంచర్ల ఇందిరమ్మ, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య, ముద్దయ్య, మాజీఎంపీపీ రామచంద్ర, మాజీ ఉపసర్పంచు గురు, యువజన నాయకుడు చుక్కారాజు తదితరులు పాల్గొన్నారు.

# బస్సుయాత్ర విజయవంతం చేయాలి



ఉరవకొండలో సభా స్థలి ఏర్పాట్లు పరిశీలిస్తున్న బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, పార్టీ నాయకులు



కూడేరులో మాట్లాడుతున్న ఎంపీపీ, బీసీ, మైనార్టీ నేతలు

ఉరవకొండ: పట్టణంలోని క్లాక్‌టవర్ ప్రాంతంలో ఈ నెల 7న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న సూచించారు. సభాస్థలి వద్ద ఏర్పాట్లను శుక్రవారం స్థానిక నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. అనంతరం బహిరంగ సభలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొంటారన్నారు. యాత్రలో పాల్గొనే ప్రజలకు భోజనం, తాగునీరు ఏర్పాట్లు చేశామన్నారు. సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పీఏసీఎస్ చైర్మన్ వడ్ల షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: ఉరవకొండలో ఈ నెల 7న నిర్వహించే సామాజిక బస్సు యాత్ర కార్యక్రమానికి మండలం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దేవేంద్ర, మైనార్టీ మండల అధ్యక్షుడు సర్దార్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సంగప్ప, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్ కోరారు. శుక్రవారం ఎంపీపీ నారాయణరెడ్డితో కలసి ఆయన చాంబర్‌లో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ టీడీపీ నేతలకు దడ పుట్టేలా బస్సు యాత్ర విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవ, పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గంగాధర్, మండల యూత్ కన్వీనర్ చంద్రశేఖర్, ప్రచార విభాగం అధ్యక్షుడు శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు రమేష్, నేతలు రామాంజనేయులు, ఎర్ర నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

# 9 నుంచి పట్టణ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు

రాయదుర్గంటౌన్: 'ఆడుదాం ఆంధ్రా'లో సచివాలయాల వారిగా ప్రతిభ కనబరిన జట్లకు ఈ నెల 9 నుంచి పట్టణస్థాయి యూనిట్‌గా మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు నియోజకవర్గస్థాయిలో జరిగే క్రీడల్లో పాల్గొంటారన్నారు.

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగభూషణ రెడ్డి హైస్కూల్ పీడీలతో మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల నిర్వాహణపై సమీక్షించారు. ఈ నెల 10 నుంచి మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి పోటీలు విజయవంతమయ్యేలా చూడాలని ఆయన సూచించారు. మండంలోని కమ్మూరు వద్ద క్రికెట్, ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాట్మింటన్ క్రీడలను నిర్వహిస్తామన్నారు.

### విద్యతోనే బంగారు భవిష్యత్తు

విడపనకల్లు: విద్యతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమని ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు అన్నారు. శుక్రవారం మండలంలోని మాళాపురం కేజీబీవీని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఎస్‌ఓ తులసికి సూచించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు భీంరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి సుంకన్న, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

బొమ్మనహాళ్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణీ గీతా భార్గవి సూచించారు. శుక్రవారం మండలంలోని గోనేహాళ్‌లో సీజనల్ వ్యాధుల కట్టడి, దోమలు ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### లీజుకు ఆర్టీసీ స్టాళ్లు

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం, ఆత్మకూరు, కంబదూరు, కుందుర్పిలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో స్టాళ్లను ఐదు సంవత్సరాలు లీజుకు ఇస్తున్నట్లు డీఎం రామచంద్ర శుక్రవారం తెలిపారు. వ్యాపారులు కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపోలో ఈ నెల 18లోపు టెండర్ ఫారాలు అందజేయాలన్నారు.

### మహిళలు ఆర్థికంగా బలపడాలి



మెప్మా ఆర్పీలతో ఎంపీ రంగయ్య

కళ్యాణదుర్గం: ప్రతి మహిళా ఆర్థికంగా బలపడాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కళ్యాణదుర్గం సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం రిసోర్స్ పర్సన్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా మహిళా సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ పాటుపడుతోందన్నారు. అమ్మఒడి, జగనన్న ఆసరా, చేయూత తదితర పథకాలతో ప్రతి మహిళనూ ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో మహిళలు వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు హేమ, వివిధ సంఘాల రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

### పథకాలు సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం రూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సాలమాన్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఈస్ట్ కోడిపల్లి, పీటీఆర్ పల్లి పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ బాలాజీ, జేసీఎస్ మండల కన్వీనర్ ఆంజనేయులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### పోస్టర్ల విడుదల

ఉరవకొండ: పట్టణంలోని క్లాక్‌టవర్ వద్ద మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను శుక్రవారం ఎమ్మార్పీఎస్ కమిటీ నాయకులు విడుదల చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి కొకుంట్ల రవి, తాలుకా అధ్యక్షులు గంగాధర, చెన్నకేశవులు పోస్టర్లు ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ ఈ నెల 8న పట్టణంలోని క్లాక్‌టవర్ వద్ద ఏర్పాటు చేస్తున్న దేశ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణకు ఆర్టీటీ పోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు హాజరవుతారన్నారు.

### పశువులకు టీకాలు



కుందుర్పి: మండల కేంద్రంలో శుక్రవారం 957 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి ప్రసాద్, ఎల్‌ఎస్‌ఏ మల్లికార్జున తదితరులు తెలిపారు. అలాగే ప్రభుత్వం సరఫరా చేసిన 350 క్వింటాళ్ల గడ్డి విత్తనాలను రైతులకు సబ్సిడీతో పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మారుతేశ్వరి, పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, వీఏ హులిరాజు తదితరులు పాల్గొన్నారు.

### పశుగ్రాసం దగ్ధం

బొమ్మనహాళ్: కణేకల్లు మండలం హనకనహాళ్ గ్రామానికి చెందిన వన్నారెడ్డి గౌనూరులో ఓ రైతు నుంచి పశుగ్రాసం కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో ఉరవకొండకు తరలిస్తుండగా బండూరు గ్రామ సమీపంలోకి రాగానే విద్యుత్ తీగలు తగులుకుని నిప్పురవ్వలు ఎగిసిపడి పశుగ్రాసం దగ్ధమైంది. స్థానికులు వెంటనే ట్రాక్టర్ నుంచి పశుగ్రాసాన్ని కిందకు జరపడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు.

### వ్యక్తిపై దాడి

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని గోళ్లలో రైతు బోయ ఈశ్వరప్పపై అదే గ్రామానికి చెందిన రైతులు దాడి చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మంజునాథ్, ఆంజనేయులు అనే రైతులు బోరు వేస్తున్న సమయంలో ఈశ్వరప్ప వచ్చి నా బోరు సమీపంలో కాకుండా దూరంగా బోరు వేయాలని వారితో వాదించాడు. మాటామాట పెరిగి అతడిపై మంజునాథ్, ఆంజనేయులు రాళ్లతో దాడి చేశారు. గాయపడిన ఈశ్వరప్పను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### గర్భిణులకు వైద్య పరీక్షలు

కూడేరు: స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు శుక్రవారం డాక్టర్ సౌమ్యరెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యురాలు మాట్లాడుతూ పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనతను అరికట్టవచ్చన్నారు. ఆరోగ్యంగా ఉన్నపుడే సుఖ ప్రసవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# జగనన్న సురక్ష పేదలకు వరం



బొమ్మనహాళ్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



విడపనకల్లు మండలం ఉండబండలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్/కంబదూరు/విడపనకల్లు/కుందుర్పి/గుమ్మఘట్ట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్న అన్నారు. శుక్రవారం బొమ్మనహాళ్ మండల పరిషత్ కార్యాలయం వద్ద సర్పంచ్ సాలిబాయి అధ్యక్షతన ఎంపీడీఓ రామచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరానికి వైద్యాధికారులతో కలసి ఎంపీపీ హాజరయ్యారు. శిబిరంలో 280 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో కార్తీక్‌రెడ్డి, ప్రియాంక, లోకేష్, చంద్రశేఖర్‌రెడ్డి, సూపర్‌వైజర్ వెంకటరమణ, ఎంఈఓ మల్లారెడ్డి, ఉప సర్పంచ్ పాతన్న పాల్గొన్నారు.

- కంబదూరులోని సచివాలయం-2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు అసియా, ప్రవీణ్‌కుమార్, ప్రసన్నకుమారు, పవన్ ఆధ్వర్యంలో 404 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, ఎంపీడీఓ సుధాకర్ రాజు , ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లింగమూర్తి, పంచాయతీ కార్యదర్శి అనురాధ తదితరులు పాల్గొన్నారు.
- విడపనకల్లు మండలంలోని ఉండబండలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి, సర్పంచు అన్నపూర్ణమ్మ, జెడ్పీటీసీ హనుమంతు, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి సుంకన్న, మాజీ సర్పంచు బోయ ఓబులప్ప, కరణం భీంరెడ్డి, ప్రకాష్‌గౌడు, అశోక్, శ్రీధర్,ఎంపీడీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.
- కుందుర్పి మండలంలోని కరిగానిపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి 430 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, జెడ్పీటీసీ రాధాస్వామి, డాక్టర్లు రోషన్, ప్రసన్న భారతి, జమీల, ముంతాజ్ బేగం, సిబ్బంది పాల్గొన్నారు.
- గుమ్మఘట్ట మండలంలోని తాళ్లకెరలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేషస్పందన లభించింది. వైద్యులు రమేష్, బాలాజినాయక్,రాంకిశోర్, జ్యోతి, కంటి సహాయకుడు ఇబ్రహీం 308 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ బ్రహ్మయ్య, సీహెచ్ఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.